# కేసు

"విక్రమ్‌సేర్ ట్రాన్స్‌లేట్ చేసిన చైనీస్‌పొయిట్రీ పుస్తకం మొన్న ఫుట్‌పాత్ మీద పాతపుస్తకాలు అమ్మేచోట కనిపించింది. జేబులో వున్న డబ్బులతో ఆ పుస్తకం కొని ఇంటికి తిరిగొచ్చాను.అసలా పొయిట్రీలో..." మాటలన్నీ లీలగా వినబడుతున్నాయి.

వినిపిస్తుందంతా గాలి ఇసురు. వర్షం సవ్వడి. గడియారం వైపు చూసింది కళ్యాణి.

తొమ్మిదిన్నర.

ఈ వర్షం ఎప్పుడు తగ్గుతుందో? తగ్గుతుందోలేదో! ఏమిటో! అసలీ పిల్లాడు వెళతాడో లేదో...'వర్షం పడుతోంది' వెళ్ళనంటాడేమో!

ఇంటి నుంచి బస్టాపుకి పదినిమిషాల నడక. వర్షం వస్తే ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది.

స్టేట్, సెంట్రల్ గవర్నమెంటు ఆఫీసులలో వుద్యోగాలు చేసేవాళ్ళుండే కాలనీయే. సరిగ్గా లేని రోడ్లని, లేని డ్రైనేజి సిస్టమ్‌ని

పట్టించుకోరు. కానీ పక్కవాళ్ళ ఎదుటివాళ్ళ జీవితాలలోకి తలకాయే కాదు, ఎంచక్కా శరీరాన్ని సైతం దూర్చేస్తారు.

"కళ్యాణీ, కాస్త టీ" సిగరెట్టు వెలిగించుకుంటూ చైతన్య అడిగాడు.

"టీపొడి, పంచదార, పాలు, నీళ్ళు అన్నీ గిన్నెలో పోసేసి స్టవ్ వెలిగించింది. కిటికీలో నుండి బయటికి చూసింది. వర్షపు జోరు తగ్గుముఖం పట్టింది.

'ఎక్కువసేపు టీ మరిగితే వేడిగా వుందని గబగబా తాగడు. ఆలస్యం అయితే తిరిగి వర్షం పెద్దది అవ్వొచ్చు' అనుకొంటూ ఒక్క పొంగు రాగానే స్టవ్ ఆర్పి వడకట్టి కప్పుల్లో పోసి అతనికి ఒక కప్పు ఇచ్చి తనూ ఒకటి తీసుకొంది.

పుస్తకం చదువుకొంటూ మెల్లగా టీ తాగుతున్న అతన్ని చూస్తూ అసహనంగా "వర్షం కాస్త తగ్గింది, బయలుదేరుతావా" అతని వేపు చూడలేక ఎటో చూస్తూ అంది కళ్యాణి.

పుస్తకంలోంచి తలెత్తి ఆమె వైపు ఒకే ఒక్క నిమిషం చూసి "బయలుదేరను" అన్నాడు.

అతని వైపు నిస్సహాయంగా చూస్తూ "ఏం" అంది.

"వర్షం"

"గొడుగు ఇస్తాను"

"గొడుగు వేసుకొని వెళ్ళాల్సినంత పని రూంలో నాకేం లేదు" మరో సిగరెట్టు వెలిగిస్తూ అన్నాడు చైతన్య.

"పని లేకపోవచ్చు, వెళ్ళాలిగా" అంది కళ్యాణి.

"రూంకా, మాధవ్ చిలకలగూడ వెళతానన్నాడు. అచ్యుత్ కేరాఫ్ దుర్గారాణి. రూంలో ఒక్కడినే బోర్. రా, ఇలా కూర్చో. ఈ పొయిట్రీ చదువుతాను విను" అంటూ వెలుగుతున్న సిగరెట్టు ఆమెకి అందించాడు.

సిగరెట్టు అందుకొని రెండు దమ్ములు తాగి పొగవదుల్తూ అదృశ్యమైపోతోన్న పొగని చూస్తూ "వర్షం పెద్దదవకముందే వెళ్ళటం మంచిది" అంది.

"ఎవరికి" సిగరెట్టు బూడిదని యాష్ట్రేలో దులుపుతూ నవ్వుతూ అడిగాడు.

"ఇద్దరికి"

"వర్షంలో తడుస్తూ వెళ్ళినా నేనిక్కడే వున్నా నాకొచ్చే నష్టం ఏముంది" అదే నవ్వుతో అడిగాడు.

కళ్యాణి మండుతోన్న సిగరెట్టు వైపు చూస్తూ మాటలకోసం తడుముకుంది.

"నీకు చెప్పానుగా చాలాసార్లు"

"ఏంటి! పక్కవాళ్ళు, కిందవాళ్ళు, పైవాళ్ళు, ఎదుటివాళ్ళు- మొత్తంగా వాళ్ళూ. అంతేగా" హేళనగా నవ్వుతూ అన్నాడు.

చైతన్య వచ్చిన ప్రతిసారీ అతన్ని రాత్రిపూట ఇంటికి పంపించటానికి చిన్నదో పెద్దదో యుద్ధం చెయ్యాల్సి వస్తోంది. చేసే ప్రతిసారీ ఆవరించే నిస్సత్తువ. ఒక అద్భుతమైన విషయం కోసం చేసే యుద్ధంలో పూర్ణశరీరం ఉత్తేజంతో ఉత్సాహంతో మెరుస్తుంది. మనసు సర్వమూలలకూ వికసిస్తుంది. కళ్ళు యుద్ధ ఫలితం కోసం దేదీప్యమానమవుతాయ్. శిరస్సు విజయం కోసం నిటారుగా నిలబడి వుంటుంది.

ఇప్పుడు ఇక్కడ చేస్తున్న యుద్ధం మనసుని శరీరాన్ని నిర్జీవం చేస్తోంది. తల అవమానభారంతో కృంగిపోతోంది. కళ్ళు సిగ్గుతో మసకబారి పోతున్నాయి.

చైతన్య వచ్చే ప్రతిసారీ యుద్ధం చేయాల్సి రావడం - ఎందుకొచ్చిన స్నేహం, ఎందుకీ తగాదా అనుకోవటం. అంతలోనే అతనికి తనపై వున్న అభిమానం గుర్తొచ్చి కరిగిపోవటం. అతనొచ్చిన ప్రతిసారీ పడుతోన్న ఘర్షణని తేలిగ్గా తీసుకోటానికి అలవాటుపడని మానసిక అజ్ఞాతరోదన.

'చైతన్యంటే అభిమానం లేదా కళ్యాణీ' - ఎందుకు లేదు. తన కాలేజ్‌మేట్. ఎన్నో మధ్యాహ్నాలు మరెన్నో సాయంత్రాలు కాఫ్కా, రే, టాల్‌స్టాయ్, కుప్రీన్, వన్‌బైటూ టీ, తనూ చైతన్య, మాధవ్, దుర్గారాణి, ముంతాజ్ ఆటపాటలతో సంబరంగా దొర్లించేశారు.

చదువులయ్యాక జీవనపోరాటంలో ఉపాధికోసం నగరం వచ్చి

గదుల్లో జీవిత ప్రారంభం. మొదట్లో ఇద్దరు ముగ్గురు అమ్మాయిలతో గది పంచుకోవటం - ఇళ్ళవాళ్ళతో నీళ్ళ తగాదా- మగస్నేహితులొస్తున్నారనే తగాదా - కరెంట్ తగాదా!

చేస్తున్న ఉద్యోగాలలో మార్పు. ఉద్యోగం చేసే చోటుకి ఇల్లుదూరం. ఇళ్ళు మారటం. రూమ్మేట్స్‌లో మార్పు. ఆడపిల్లలు! ఇల్లు అద్దెకి ఇవ్వకపోవడం. ఇంటి వేట. పెరిగే అద్దెలు, పెరగని జీతాలు. కన్నుమూసినా తెరచినా గూటికోసం ఆరాటం - వెతుకులాట.

తిన్నా తినకపోయినా ఒక గది కావాలి. సొంతంగా అచ్చంగా ఓ గది కావాలి.

సొంత ఆస్తి పెంచుకోవాలనే తహతహలేని మనసులో ఇంటివాళ్ళ గొడవలు లేని ప్రశాంతజీవితం కోసం తాపత్రయం.

అడుగు నేల కొనలేని భాగ్యనగరంలో అపార్ట్‌మెంట్‌ల హడావిడిని తట్టుకునే తాహతు లేక ఒక్క గది కొనుక్కున్నా చాలు అనుకునే సమయంలో ఆ అవకాశం వాస్తు రూపంలో దొరికింది.

ఒక అపార్ట్‌మెంట్‌లో టూ బెడ్‌రూమ్స్ ఫ్లాట్ కొనుక్కునే ఆసామి ఆ ఫ్లాట్‌కి మరో గది వుంటే కాని వాస్తు కుదరదని పక్క ఫ్లాట్‌లోని మరో గదిని కొనుక్కుంటానని బిల్డర్ని అడిగాడు. బిల్డర్ ఒప్పుకున్నాడు. రెండో ఫ్లాట్‌ని సింగిల్‌బెడ్ రూమ్‌గా అమ్ముదాం అనుకుంటుండగా ఇటుపక్క ఫ్లాట్ కొనుక్కునే అతను తనకీ మరో గది కావాలన్నాడు. అతనికీ ఆ గది ఇచ్చేస్తే హాలు, కిచెన్, బాత్‌రూమ్‌ని ఎవరు కొనుక్కుంటారని బిల్డర్ మదనపడే సమయంలో కళ్యాణి అది కొనుక్కోటానికి ముందుకు వచ్చింది.

కూడపెట్టింది - ప్రపంచంలో వున్నన్ని లోనులు తీసుకొని సొంత ఇంటికి మారిపోయింది కళ్యాణి.

లోన్ తీర్చాలి. వడ్డీ కట్టాలి. వచ్చిన ఒక్క అవకాశం వదలక రాత్రంతా డబ్బింగ్ చెపుతుంది సినిమా వాళ్ళకి, టీ.వి.వాళ్ళకి. ఉదయమంతా ఆఫీసులో పని.

ఆరోజు తెల్లార్లు డబ్బింగ్ చెప్పి ఐదవుతుంటే ఇంటికి వచ్చింది. ఓ రెండు గంటలు నిద్రపోయి లేచి ఆఫీసుకి రెడీ అవొచ్చని పక్కపై వాలిన

గంటకే ఆగకుండా మోగుతోన్న కాలింగ్‌బెల్ సవ్వడికి మెలకువ వచ్చింది. మండుతోన్న కళ్ళతోనే వెళ్ళి తలుపు తీసింది.

పసుపు పూసిన ముఖం. నుదుటిన పెద్ద కుంకుమ బొట్టు. అపరిచిత స్త్రీ.

"ఉదయమనగా పోయి తెల్లారేవరకూ రావ్. ఎక్కడికి పోతావ్" తీక్షణమైన స్వరం. వదిలిపోయిన నిద్రమత్తుతో "మీరెవరూ" అడిగింది కళ్యాణి.

"మావారు ఈ ఫ్లాట్ మెయిన్‌టెనెన్స్ సెక్రటరీ. సెకెండ్‌ఫ్లోర్‌లో వుంటాం. అఁచెప్పు. నువ్వేం ఉద్యోగం చేస్తావ్" అదే స్వరంతో అందామె.

ఆ స్వరం కొత్తకాదు. ఇంతకుముందు అద్దె ఇళ్ళలో విన్న స్వరమే. కాకపోతే ఇది సొంత ఇల్లు. సొంత ఇంటిలో ఇలాంటి స్వరం! చిర్రెత్తుకొచ్చింది. అయినా మృదువుగా "ఎందుకు అడుగుతున్నారు" అని అడిగింది.

"ఎందుకా? పేపర్లో వేయిద్దామని. ఏంటమ్మాయి ఇది? సంసార్లుండే కొంపలు. ఒక పద్ధతీపాడూ వుండాలి. ఈ ఫ్లాట్స్‌లో పెళ్ళికెదిగిన కూతుళ్ళున్న తల్లులంతా నీ గురించి భయపడుతున్నారు" అంది.

"నా గురించా?! ఎందుకు"

"అర్ధరాత్రి, అపరాత్రి వస్తావని"

"చూడండి. ఇది నా ఇల్లు. నా ఇంటికి నేను ఎప్పుడైనా వస్తాను. వెళతాను. అనవసరంగా నా విషయాలలో జోక్యం చేసుకోకండి" ఖచ్చితంగా చెప్పింది కళ్యాణి.

లోపలికి వెళ్ళిపోయింది.

తలుపైతే వేసింది కానీ మనసులో 'ప్రశ్నలు ప్రారంభం' అనుకొంటూ కాఫీ చేసుకొని తాగింది. వంట పని మొదలుపెట్టింది. మనసంతా దిగులు.

ఆరోజు రాత్రి పదకొండు గంటలకి ఇంటికి వచ్చేసరికి గేటుకి తాళం వేసి వుంది. వాచ్‌మాన్ కాస్త లోపల నిద్రపోతున్నాడు. గేటు కొట్టీకొట్టీ విసుగొచ్చింది. రాయి తీసుకొని తలుపుకి వేసి కొట్టింది. ఆ శబ్దానికి

గంటకే ఆగకుండా మోగుతోన్న కాలింగ్‌బెల్ సవ్వడికి మెలకువ వచ్చింది. మండుతోన్న కళ్ళతోనే వెళ్ళి తలుపు తీసింది.

పసుపు పూసిన ముఖం. నుదుటిన పెద్ద కుంకుమ బొట్టు. అపరిచిత స్త్రీ.

"ఉదయమనగా పోయి తెల్లారేవరకూ రావ్. ఎక్కడికి పోతావ్" తీక్షణమైన స్వరం. వదిలిపోయిన నిద్రమత్తుతో "మీరెవరూ" అడిగింది కళ్యాణి.

"మావారు ఈ ఫ్లాట్ మెయిన్‌టెనెన్స్ సెక్రటరీ. సెకెండ్‌ఫ్లోర్‌లో వుంటాం. ఆఁచెప్పు. నువ్వేం ఉద్యోగం చేస్తావ్" అదే స్వరంతో అందామె.

ఆ స్వరం కొత్తకాదు. ఇంతకుముందు అద్దె ఇళ్ళలో విన్న స్వరమే. కాకపోతే ఇది సొంత ఇల్లు. సొంత ఇంటిలో ఇలాంటి స్వరం! చిర్రెత్తుకొచ్చింది. అయినా మృదువుగా "ఎందుకు అడుగుతున్నారు" అని అడిగింది.

"ఎందుకా? పేపర్లో వేయిద్దామని. ఏంటమ్మాయి ఇది? సంసార్లుండే కొంపలు. ఒక పద్దతీపాడూ వుండాలి. ఈ ఫ్లాట్స్‌లో పెళ్ళికెదిగిన కూతుళ్ళున్న తల్లులంతా నీ గురించి భయపడుతున్నారు" అంది.

"నా గురించా?! ఎందుకు"

"అర్ధరాత్రి, అపరాత్రి వస్తావని"

"చూడండి. ఇది నా ఇల్లు. నా ఇంటికి నేను ఎప్పుడైనా వస్తాను. వెళతాను. అనవసరంగా నా విషయాలలో జోక్యం చేసుకోకండి" ఖచ్చితంగా చెప్పింది కళ్యాణి.

లోపలికి వెళ్ళిపోయింది.

తలుపైతే వేసింది కానీ మనసులో 'ప్రశ్నలు ప్రారంభం' అనుకొంటూ కాఫీ చేసుకొని తాగింది. వంట పని మొదలుపెట్టింది. మనసంతా దిగులు.

ఆరోజు రాత్రి పదకొండు గంటలకి ఇంటికి వచ్చేసరికి గేటుకి తాళం వేసి వుంది. వాచ్‌మాన్ కాస్త లోపల నిద్రపోతున్నాడు. గేటు కొట్టీకొట్టీ విసుగొచ్చింది. రాయి తీసుకొని తలుపుకి వేసి కొట్టింది. ఆ శబ్దానికి

వాచ్‌మాన్ నిద్రలేచాడు. పరిగెత్తుకొచ్చి తలుపుతీశాడు.

అప్పటికే చాలా ఫ్లాట్స్‌లో వాళ్ళు లేచి చికాకుపడుతున్నారు.

"తాళం వేశారేంటి"

"వేయమన్నారండి"

"ఎవరు"

"సెక్రటరీగారు. అదే వామనరావుగారు".

పన్నెండు ఫ్లాట్స్ లేవు. సెక్రటరీ-ప్రెసిడెంట్, ప్రతివాడికి పెత్తనపు పైత్యమే.

"తాళం వేస్తే బయటికి వెళ్ళినవాళ్ళు రావటం ఎలా? అందరూ వచ్చేవరకు మేలుకొని వుండటమంటే నీకు కష్టమేగా. ఏవేళకి నేనొస్తానో తెలియదు. నువ్వు కీ ఇస్తే నేను డూప్లికేట్ చేయిస్తాను. నిన్ను లేపకుండా నేను తాళం తీసుకొని రావొచ్చు" అంది కళ్యాణి.

"సరేనమ్మా"

◆◆◆

ఉదయం ఆఫీసుకి వెళ్ళేటప్పుడు వాచ్‌మాన్‌ని తాళం అడిగింది.

"ఇవ్వొద్దన్నారు"

"ఎవరు"

"వామనరావుగారు"

"ఎందుకు"

"తెలియదు"

"తాళం ఇవ్వకపోతే రాత్రి నేనొచ్చేవరకు తాళం వెయ్యకు" చెప్పి కళ్యాణి వెళ్ళిపోయింది.

రాత్రి పని అయి ఇంటికి వస్తుంటే 'తాళం వేసేశారేమో? వాచ్‌మాన్ నిద్రపోతే అతన్ని నిద్రలేపే ప్రోసెస్‌లో మొత్తం బిల్డింగ్ అంతా నిద్రలేస్తున్నారు. అలసిపోయి ఇంటికి వెళ్ళగానే పక్కపై వాలిపోవాలని వుంటుంది. కానీ వీలు కావడం లేదు. రోజూ ఏదో గోలే. అద్దె ఇళ్ళలో ఈ

తాళాల బాధ పడలేకేగా సొంత ఇల్లని కలవరించింది' అనుకొంటూ ఇంటికి వచ్చేసరికి తిరిగి తాళం పలకరించింది కళ్యాణిని.

వాచ్‌మాన్‌ని నిద్రలేపి లోపలికి వెళ్ళగానే ఆమెకి చికాకువచ్చేసింది. ఆ చికాకుని ప్రదర్శించే అవకాశమూ లేక పక్కపై వాలిపోయింది.

◆◆◆

ఉదయం ఏడున్నరకి వామనరావు ఫ్లాట్ ఎక్కడో కనుక్కొని వెళ్ళింది.

వామనరావు భార్య అనసూయ బయటికి వచ్చింది.

"నాకు కీ ఇస్తే డూప్లికేట్ చేయించుకొనిస్తాను" అంది కళ్యాణి.

"ఎందుకు ఆలశ్యంగా వస్తారు? మగవాళ్ళే ఎంత పని వున్నా పెందరాళే ఇంటికి వచ్చేస్తారు. ఆడదానివి అర్ధరాత్రి వరకు బయట నీకేం పని" అందామె.

కళ్యాణి తప్పనిసరిగా తను చెప్పే డబ్బింగ్ విషయం చెప్పింది.

అంతా విని "అర్ధరాత్రి వరకు స్టూడియోల చుట్టూ తిరుగుతావా" అంది అనసూయ.

"తాళం ఇస్తారా" ఆమె మాటలని పట్టించుకోకుండా అడిగింది.

"అడిగి చెపుతాను" అంటూ అనసూయ ఇంట్లోకి వెళ్ళి వామనరావుని అడిగింది.

"ఆలోచించి చెబుతామని చెప్పు" అన్నాడు వామనరావు.

అనసూయ ఆ విషయం కళ్యాణికి చెప్పింది. కళ్యాణి ఏం మాట్లాడకుండా ఇంటికి వెళ్ళిపోయింది.

ఆఫీసుకి వెళుతూ వాచ్‌మాన్‌కి తన దగ్గర వున్న తాళం కప్ప, తాళం ఇచ్చి "ఇది వెయ్యి. దీని డూప్లికేట్ నా దగ్గరుంది" అంది.

వాచ్‌మాన్ వాళ్ళు ఏమంటారోనని తటపటాయిస్తుంటే పర్సులోంచి ఏభై రూపాయిల నోటు తీసి అతని చేతిలో పెట్టింది.

వాచ్‌మాన్ మారుమాట్లాడకుండా తాళం తీసుకుని నమస్కారం పెట్టాడు.

కళ్యాణి బస్టాపు వరకు ఎలా వెళ్ళిందో ఆ బస్సు ఎలా ఎక్కిందో

కూడా తెలియలేదు. ఆగకుండా కన్నీళ్ళు వచ్చేస్తున్నాయి.

'ఏం చేసింది తనూ, డబ్బులు ఇచ్చి నోరు మూయించే ఆలోచన వచ్చిందా. ఛ. ఛా. ఈ ఇల్లూ వద్దు . ఈ డబ్బింగ్ పనులూ వద్దు. ఎందుకు వాళ్ళు అలా యిబ్బంది పెడుతున్నారు'- పలు ఆలోచనలు.

◆◆◆

పది రోజులు గడిచిపోయాయి. ఓ రోజు ఉదయం అనసూయ, మరో స్త్రీ వచ్చారు.

"ప్రియంవద. ఈ ఫ్లాట్స్ ప్రెసిడెంట్‌గారి భార్య" అంది అనసూయ.

'ఎందుకొచ్చారో వీళ్ళు' అని కళ్యాణి అనుకొంటూండగా "ఈ రోజు ఫ్లాట్స్‌లో మీటింగ్ వుంది. మీరు తప్పకుండా రావాలి" మర్యాదగా చెప్పింది ప్రియంవద.

"ఎన్ని గంటలకి" దడదడలాడే గుండెలతో అడిగింది కళ్యాణి.

"పదకొండుకి" చెప్పింది ప్రియంవద.

"వస్తానండి" అంది కళ్యాణి.

ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అనుకొంటూ కళ్యాణి మీటింగ్ దగ్గరికి వెళ్ళింది.

అనసూయ, వామనరావు, ప్రియంవద, రాఘవేంద్రరావు, ఫణిశర్మ మరో ముగ్గురు ఆడవాళ్ళు మగవాళ్ళు వున్నారు. వీళ్ళంతా ఓనర్స్. అద్దెకి వున్నవాళ్ళు కనిపించలేదు.

"మొన్న మీ ఇంటికి వచ్చిందెవరు" అడిగాడు వామనరావు.

"మొన్న ...ఎన్ని గంటలకి? అయినా ఎందుకు" అంది కళ్యాణి.

"మొన్న సాయంత్రం ఏడింటికి. ఎందుకేంటి, వచ్చినతను ఆటోలో వచ్చి కింద ఆటో ఆపుకొని మీ ఇంటికొచ్చాడు. మళ్ళీ అరగంట తర్వాత వెళ్ళాడు" అన్నాడు ఫణిశర్మ.

"అయితే"

"అలా ఎవరింటికి ఎవరొస్తారు" అడిగాడు రాఘవేంద్రరావు.

"ఏమో"

"ఎవరొస్తారో తెలియదా? విటులు. ఇక్కడంతా మిమ్మల్ని 'కేస్' అనుకొంటున్నారు" అన్నాడు వామనరావు.

అతని వైపు ఒక్క క్షణం చూసి "కేస్‌నే" అంది ఎవ్వరికీ ఏ సంజాయిషీ ఇవ్వకుండా.

నోటమాట రానట్టు అంతా చూస్తుండిపోయారు.

"అది కాదండి. అసలు మీరెవరూ? ఒక్కళ్ళూ వుంటారు. మీ కోసం మగవాళ్ళు, ఆడవాళ్ళు కలసివస్తారు. విడివిడిగానూ వస్తారు. ఎవరు వాళ్ళంతా? వాళ్ళకి మీతో ఏం పని" ఆరా తీశాడు ఫణిశర్మ.

"చూడండి. మీ ఇళ్ళకి ఎవరొస్తున్నారో ఎందుకొస్తున్నారో నేనెప్పుడైనా అడిగానా? నా ఇంటికి వచ్చిన వాళ్ళంతా ఎవరో ఎందుకొచ్చారో మీ అందరికి నేనెందుకు చెప్పాలి? వాళ్ళ వల్ల మీకేమైనా ఇబ్బందులుంటే స్పష్టంగా చెప్పండి. అంతేకాని నోటికొచ్చినట్టు మాట్లాడకండి" చెదిరిపోతోన్న శాంతాన్ని బిగపట్టి అంది కళ్యాణి.

"మా ఇళ్ళకి వస్తే ఏంటి? మేం ఒంటరిగా వుండటం లేదు" అన్నాడు వామనరావు.

"ఒంటరిగా వున్నవాళ్ళకి స్నేహితులు, బంధువులు వుండకూడదా"

"వాళ్ళందర్నీ మాకు పరిచయం చెయ్యొచ్చుగా. అయినా ఒంటరిగాళ్ళకి బంధువులూ స్నేహితులూ" హేళనగా అన్నాడు ఫణిశర్మ.

"ఏం వాళ్ళకి కష్టాలు, కన్నీళ్ళూ తప్ప ఏం ఉండకూడదా?" అడిగింది కళ్యాణి.

"నీ విషయాలేం చెప్పవేంటి? ఒకే చోట వుంటున్నాం" అంది ప్రియంవద.

"వచ్చినవాళ్ళంతా కళ్యాణి వున్నారా అని అడుగుతారు. ఇంటికొచ్చిన మగవాళ్ళు అలా ఒక ఆడపిల్లని అడగటం ఏం బాగుంటుంది" అన్నాడు ఫణిశర్మ.

కళ్యాణికి సహనం నశించిపోయింది.

వీడికి వుద్యోగం, సొంత ఇల్లు, ఇంట్లో వాళ్ళు సరిపోలేదేమో - వీడి

పెత్తందారితనం చూపించటానికి.

"సంస్కారం వున్న మనుషులతో అయితే మాట్లాడొచ్చు. మీరు మనుషులో కాదో నాకు తెలియటం లేదు. నేనిలానే వుంటాను. మీ ఇష్టం. మీ ఇష్టం వున్నట్టు ఏడవండి" అనేసి కళ్యాణి తన ఇంటికి వచ్చేసింది.

వాళ్ళకి తన విషయం ఎందుకు? వాళ్ళు అలా సతాయించేకొద్దీ మరింత పంతం వస్తుంది తనకి ఎలా ఇష్టమో అలా వుండాలని.

ఇవన్నీ ఓ ఎత్తు.....నిన్నటికి నిన్న ఉదయం పెద్ద గొడవ ఆ ఫణిశర్మతో.

బయట వర్షం. ఆఫీసుకి వెళ్ళటానికి బద్ధకంగా అనిపించి ఇంట్లోనే వుండి పోయింది- 'క్రైమ్ అండ్ పనిష్మెంట్' చదువుకుంటూ. తలుపు చప్పుడు. తీసింది. సగం తడిసిపోయి నాగభూషణం. డిగ్రీలో ఇంగ్లీషు పాఠాలు చెప్పారు.

అనుకోకుండా వచ్చిన ఆయన్ని చూడగానే సంతోషంతో 'రండిసార్' అంటూ ఆహ్వానించింది.

"ఇక్కడి వరకు వచ్చానమ్మా. ఇక్కడేకదాని వచ్చాను. గుడ్. ఇల్లు బాగుంది" అని ఆగి "నీకిక్కడ బాగుందామ్మా" అని అడిగారు ఆత్రంగా.

"ఏం సార్"

"నీ ఇల్లు ఏదో తెలియదు కదా. కింద ఇంటి దగ్గర ఎవరో కనిపిస్తే అడిగాను. అతను ఎగాదిగా చూస్తూ మీరెవరూ? ఎక్కడ్నుంచి వస్తున్నారు? మీ కేం పని ఆవిడతో అంటూ చంపాడమ్మా" అని "ఏమైనా ఇబ్బందులుంటే క్లారిఫై చేసుకోమ్మా. దొంగవెధవలు. ఒంటరి ఆడపిల్లలంటే ప్రతివాడికి లోకువే. సంస్కారం నేర్పించాలని ప్రయత్నించినా నేర్చుకోరమ్మా" అంటూ ఆయన ఆ బాధలని ఆయన ధోరణిలో చెపుతున్నారు.

గుండెల్లో అవమానపు అగ్ని మరింత రాజుకుంది.

నాగభూషణంగారు కాసేపు అవీ ఇవీ మాట్లాడి వెళుతూ "నే రావటం వల్ల నీకేమైనా వీళ్ళతో ఇబ్బందులు ఎదురయితే నన్ను క్షమించమ్మా" అన్నారు.

"ఇబ్బందేంటి సార్. మిమ్మల్ని అడిగింది ఎవరు? చూపించండి.

ఎందుకంటే ఈ ఫ్లాట్స్‌లో మతిస్థిమితం లేని మగవాడు ఉన్నాడు. అతనే అడిగుంటాడు. అతనికి తనేం మాట్లాడతాడో అతనికే తెలియదు" అంది కళ్యాణి.

నాగభూషణరావు వెళుతూ వెళుతూ ఫణిశర్మని చూపించి 'ఇతనే' అని చెప్పగానే "ఆఁ నే చెప్పిన మతిలేనివాడే" అంది కళ్యాణి.

నాగభూషణరావు వెళ్ళిపోయాడు.

"ఏంటి? ఎవరని, ఎందుకొచ్చారని, ఏం పని అని అడిగారంట" ఫణిశర్మని అడిగింది కళ్యాణి.

"అడిగితే తప్పా? మీ వెల్‌విషర్‌గా అడిగాను. అయినా నా గొడుగు పోయింది అందుకు అడిగా" అన్నాడు ఫణిశర్మ.

"గొడుగుపోతే ఎందుకొచ్చావ్? అవిడతో పనేంటి అని అడుగుతారా? మీరు దొంగలా? అదీ గొడుగు దొంగలా అని అడగాలి. మీ వస్తువులు జాగ్రత్తగా పెట్టుకోకుండా వాళ్ళనీ వీళ్ళనీ అడగటం భావ్యం కాదు" అంటూ కళ్యాణి ఇంట్లోకి వచ్చేసింది.

ఐదు నిముషాల తర్వాత ప్రియంవద, అనసూయ, ఫణిశర్మ భార్య కాంతం వచ్చారు.

"ఏంటి మా ఆయన్ని సినిమాకి రమ్మన్నావంట"అడిగింది కాంతం.

కళ్యాణికి నోటమాట రాలేదు.

ముగ్గురు నోటికొచ్చినట్టు వాగి వెళ్ళిపోయారు.

మాట్లాడే ఓపికలేనట్టు కళ్యాణి దిక్కులు చూస్తూ కూర్చుండిపోయింది.

ఒక్కో సంఘటన గుర్తు తెచ్చుకుంటూ మౌనంగా ఖాళీ టీ కప్పువైపు చూస్తున్న కళ్యాణిని చూస్తూ "ఏంటంత ఆలోచిస్తున్నావ్?" అడిగాడు చైతన్య.

"చైతన్యా! ఇంటికి వస్తానన్నవాళ్ళని రావొద్దనటం, వచ్చినవాళ్ళని వెళ్ళి పోమనటం చాలా కష్టం. అయినా పదేపదే నువ్విక్కడ రాత్రిపూట వుండొద్దని అంటున్నానంటే నువ్వు వెళ్ళటం ఎంత తప్పనిసరో ఆలోచించు" అంది కళ్యాణి.

"ఎందుకు వెళ్ళాలో చెప్పు? ఏంటి నువ్వింత క్రూయల్‌గా మాట్లాడుతున్నావ్"

"కారణాలు చెప్పకపోతే వెళ్ళవా?"

"వెళ్ళను"

"కారణాలు అడక్కుండా నా మాటకి గౌరవం ఇవ్వవా?"

"ఏంటి కళ్యాణి. గౌరవం లేకకాదని నీకూ తెలుసు. నువ్విలా మరొకరికి లొంగివుండటం ఇష్టంలేక" అన్నాడు చైతన్య.

చైతన్య సిగరెట్టు పొగని ముక్కుల్లోంచి వదులుతూ "ఏమయ్యింది నీకు? ఎలా ఉండేదానివి లెక్కలేనట్టు. నువ్వనుకున్నవి ఎలా సాధించేదానివి. ఇప్పుడేం అయింది నీకు? ఎందుకిలా వాళ్ళందరికి దాస్యం అయిపోతున్నావ్" అభిమానంతో ఆమె తలపై చెయ్యివేసి నిమురుతూ అడిగాడు చైతన్య.

దిగులు మేఘం కళ్యాణి గుండెలని మెలిపెట్టేస్తోంది.

ఆడపిల్లలని చదివించటం అనివార్యమనే సందర్భంలో చదువుకోటానికి ఏమంత ఇబ్బంది పడలేదు. ఆరోజుల్లో ర్యాగింగ్ చేసే పిల్లల్ని ఈవ్‌టీజింగ్ కుర్రాళ్ళని, డోనేషన్ల యాజమాన్యాన్ని ఎదిరించింది. రేప్ క్రిమినల్స్‌పై ఎన్నెన్నో యుద్ధాలు చేసింది.

మరి ఇప్పుడు ఎవరిపై చెయ్యాలి.

తిరుగుబాటు...ఎవరిపై? ఎన్నెన్ని తిరుగుబాట్లు. తనకోసం తన వునికిని తన మనసు చిత్రాన్ని నిలుపుకోడం కోసం, తన లోపలి స్వేచ్ఛకోసం, బాహ్య స్వేచ్ఛకోసం తిరుగుబాటు.....

లిప్‌స్టిక్‌ని, ఐలైనర్ని, పెర్‌ఫ్యూమర్‌ని, జీన్స్‌ని జీర్ణించుకోటానికి జీర్ణాశయమే మొండికేసింది. ఎసిడిటి.... పొట్టలో.... గుండెలో.... తలలో.... ఎంతెంత ఎసిడిటి....

"మాట్లాడవేంటి? ఎందుకంత భయం వాళ్ళంటే" అడుగుతున్నాడు చైతన్య.

మాటలు! ఏం మాట్లాడాలి. ఒక్కొక్క సంఘటన తనని ఎంత ఒంటరిగా చేసేశాయో....

"నిద్రొస్తుంది" అంటూ చాపపై కూర్చున్న చోటే నడుం వాల్చాడు చైతన్య.

అతనికి ఒక దుప్పటి కప్పి మరో చాప పరిచి దానిపై వాలింది కళ్యాణి.

చాలాసేపు నిద్రపట్టలేదు. వాళ్ళంతా ఎందుకలా గొడవలు పెట్టుకుంటున్నారు... ఆలోచనలు. మెల్లగా ఎప్పుడో నిద్రలోకి జారుకుంది.

టపటపా చప్పుడు.

ఉలిక్కిపడి లేచింది కళ్యాణి. తెల్లని వెలుతురు పరచుకున్న గది. చాపపై కూర్చుని పుస్తకం చదువుతూ చైతన్య.

కళ్యాణి వెళ్ళి తలుపు తీసింది.

వాళ్ళంతా ఒక్కసారి లోపలికి వచ్చేసారు.

"చూశారా... చూశారా... రాత్రంతా ఇద్దరూ ఇంట్లోవున్నారు. మగవాళ్ళు వస్తారు- పగలైనా రాత్రైనా తలుపులు వేసుకొనే వుంటారు. ఇక్కడ జరుగుతోంది వ్యాపారమే... ఎవడే వాడు... నీకేం అవుతాడే.... సిగ్గులేదూ... ఇల్లు ఖాళీ చెయ్యి. పోవే.... పో.... ఇక్కడ్నుంచి. పోలీసోళ్ళని పిలుస్తా...." కలగాపులగపు మాటలు. ఆడవాళ్ళు, మగవాళ్ళు.....

కళ్యాణి నిస్తేజం నిస్సహాయాల నుంచి తేరుకుంటూ "గెటౌట్" అంది.

తలానాలుగు అని పోయారు.

చైతన్య వున్నచోటనే శిలై "ఇంతలా మాట్లాడతారని చెప్పలేదేం. ఛ. అనవసరంగా మాటలు పడ్డాను. నేనెప్పుడూ ఇలా అనిపించుకోలేదు" అనేశాడు.

"అన్ని అవమానాలు అన్ని కష్టాలు మేం పడాలి. మనిద్దరికి సంబంధించిన విషయం వచ్చేసరికి ఒక్కమాట నువ్వు పడలేవ్. వెళ్ళిపో. నిన్ను ఒక్క క్షణం భరించలేను. ఏం మనుష్యులయ్యా మీరు? ఎవ్వరూ లేని ఇల్లు నాకలవాటే. ఉండి వెళ్ళిపోతోన్న గుండె నాకెప్పటికి అలవాటవుతుందో!" కళ్యాణి గుండెల్లో సుళ్ళు తిరుగుతోన్న దుఃఖం.

◆◆◆

"ఈ వాటర్ బిల్లుని వామనరావుకి, ఈ కరెంట్ బిల్లుని ఫణిశర్మకి, ఈ ఇంటిపన్ను కాగితాన్ని రాఘవేంద్రరావుకి ఇవ్వు" వాచ్‌మాన్‌తో చెప్పింది కళ్యాణి.

ఐదు నిమిషాల్లో అంతా బిలబిలలాడుతూ "ఏంటిది" అన్నారు.

"బిల్లులు"

"మాకెందుకు పంపారు"

"కట్టమని"

"మేం ఎందుకు కట్టాలి"

"నా మంచి చెడ్డలు మీవన్నారు కదా. మరి నా ఆర్థిక లావాదేవీల్లో మీరు పాలుపంచుకోవాలిగా" అంది కళ్యాణి.

"ఎంత పొగరు"....అంటూ బిల్లులన్నీ పడేసి కోపంగా వెళ్ళబోతోంటే "చూడండి. మరోసారి మీలో ఎవరైనా నా జోలికి వస్తే కోర్టులో కలుసుకుందాం" అంది.

◆◆◆

వారం...పక్షం...నెల యింకిపోయాయి.

ఇంటికి వచ్చే పోయేవారు లేరు.

అనంద సంబరాలు ముగిసిపోయాయి.

ఈ ఇల్లు నాదిలాగే కన్పిస్తుంది. ఈ ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు అన్నీ నాకు సంబంధించినవే. ఈ ఇంట్లో జీవితం అచ్చంగా నా జీవితమే అనిపిస్తోంది. కానీ తెల్లారిలేచింది మొదలు తెల్లారే వరకు లోకాన్ని ఆక్రమించే సూర్యచంద్రుల్లా ఇంట్లో నా సుఖదుఃఖాలన్నీ పొరుగువారి ఆలోచనా ధోరణిపై ఆధారపడి వుంటాయి.

ఫ్లాట్స్‌లో వాళ్ళకి కళ్యాణిని ఎలా ఏ విషయంలో వేధించాలో తెలియటం లేదు. ఏం తోచటంలేదు. క్షుద్రసస్పెన్స్ సీరియల్ మధ్యలో ఆగిపోయిన యిరుకుతనం మనసుల్లో.

ఆరోజు డబ్బింగ్ చెప్పేందుకు వెళ్ళడానికి కళ్యాణి రెడీ అవుతూంటే వాచ్‌మాన్ భార్య వచ్చింది.

"మీ జుట్టు వాళ్ళ బాల్కనీలో పడుతోందంటమ్మా, బాల్కనీలో తలదువ్వు కోవద్దన్నారు" చెప్పింది వాచ్‌మాన్ భార్య.

"ఎవరు"

"ఫణిశర్మగారి భార్య"

"జుట్టు వూడిపడుతుందని గుండైతే గీయించుకోలేంగా. దువ్వకుండాను వుండలేం. పడితే దాచి సవరం కట్టించుకోమను" నవ్వుతూ అంది కళ్యాణి.

వాచ్‌మాన్ భార్య వెళ్ళిపోయింది.

'ఏదో ఒక గొడవ లేకపోతే వీళ్ళకి నిద్రపట్టదనుకుంటా' అనుకుంటూ కళ్యాణి డబ్బింగ్ థియేటర్‌కి వెళ్ళింది.

డబ్బింగ్ చెప్పి థియేటర్ నుంచి బయటికి వస్తూంటే "కళ్యాణి" అంటూ ఎదురొచ్చాడు రసూల్.

"హాయ్" అంటూ ఒకరినొకరు వెలిగిపోతున్న కళ్ళతో పలకరించుకున్నారు.

"ఎప్పుడొచ్చావ్" అడిగింది కళ్యాణి.

"ఉదయం"

"రికార్డింగా"

"ఆఁ ఒక ఎపిసోడ్‌కి మ్యూజిక్ కంపోజ్ చేశాం. ఇంటికా" అడిగాడు రసూల్.

"ఆఁ"

"నా పని అయిపోయింది. ప్రైవేట్ ఛానల్స్ పెరిగాయి కదా. బాగా వర్క్ పెరిగింది. మద్రాస్ వదిలేద్దాం అనుకుంటున్నాను. ఇక్కడికి వచ్చేద్దామని. ఇక్కడ సెటిల్ అయ్యేదాకా నీ దగ్గరుంటే నీకేమైనా సమస్యా? నీతో చాలా మాట్లాడాలి. ఇంటికి పోదామా" అన్నాడు రసూల్.

ఎన్నో రాత్రులు రసూల్ పాటలతో, మాటలతో రాగాల పదచిత్రమైన గది నాకింకా గుర్తే. ఈ రాత్రి తిరిగి రసూల్‌తో ఇంటికి వెళితే ఇంకేమైనా వుందా? ఇన్ని రోజుల సోకాల్డ్ శాంతి కరిగిపోదూ....

భయపడుతున్నావా కళ్యాణీ?! కంగారు పడుతున్నావా? జుట్టు రాల్తుందంటే 'రాల్తే రాలనీ' అన్నావ్. తలదువ్వటం మాననీ అన్నావ్. స్నేహితులు వస్తారంటే, అందులో మగస్నేహితులంటే ఎందుకంత ఆలోచనలో పడుతున్నావ్? వాళ్ళని తప్పించు కోవాలనుకుంటున్నావా?

"నేనిప్పుడే వస్తా" ఎవరో పిలిస్తే రసూల్ థియేటర్‌లోకి వెళుతూ అన్నాడు.

మగవాళ్ళు ఇంటికి వస్తే... ఆ ఒంటరితనం ఆ ఏకాంతంలో చేయకూడని పనులు చేస్తున్నానని వాళ్ళు అనుకుంటారని భయపడుతున్నానా? స్త్రీ పురుషుల స్నేహంలో శరీరం ప్రసక్తి వుండొచ్చు, లేకపోవచ్చు. ఎవరి ఇష్టం వాళ్ళది కదా! ఖచ్చితంగా శరీరం ప్రసక్తి వుందని వాళ్ళు నమ్ముతున్నారు. అభ్యంతర పెడుతున్నారు. మన్నించి వాళ్ళని తృప్తిపరచాలని అనుకుంటున్నానా? వాళ్ళంతా ఒక్క శరీరం గురించే మాట్లాడుతున్నారా? ఎన్నెన్నో మిళితమై వున్నాయి కదా!. కొన్ని స్నేహాలే. అచ్చంగా స్నేహమే. కొన్ని ఆకర్షణా తరంగాలు. మరికొన్ని స్పందనా జలపాతాలు. ఇప్పుడు శీలం అంటూ గోలచేసే అశ్లీలపు ఆగంతకుల నుంచి సూడో విలువలు, సోకాల్డ్ స్వేచ్ఛా నేర్చుకో బోతున్నానా? శీలం... శీలం... శీలం... బ్లడీ శీలం... సుఖం... శాంతి... ఆనందం... విషాదం... సరదాలు... సంబరాలు... పరదాలు... పదబంధాలు... అన్నింటిని నిర్దాక్షిణ్యంగా కాలరాసి ఏం కోరుకుంటుంది తను? శీలవతిననిపించు కోవటమా? అనిపించుకున్నంత కాలం మిగిలినవి దొంగ నవ్వులు, శుష్కపలకరింపులు.

రసూల్ థియేటర్ నుంచి బయటికి వచ్చాడు.

"వెళదామా" అన్నాడు.

వాళ్ళందరి ముఖాలు అసహ్యంగా... క్రూరంగా... నా కళ్ళముందు.

'జీవమున్న జీవితం కోసం బ్లడీశీలపు పరదాలని చింపిపారేస్తే... నయాగరాలో విసిరేస్తే 'కేసు' గానే మిగుల్తాను వాళ్ళకి - హృదయాన్ని రాగరంజితం చేసే అనురాగాల కళ్యాణి నాకు మిగుల్తుంది' అనుకొంటూ "ఇంటికి వెళదాం. రా రసూల్" అంది.